అన్నాడు రాజారావు.

దానికతను ''టైము సెన్సు అంటున్నారు. మరి మీరు కూడా ఇక్కడే ఉన్నారు. మీరే ఆఫీసులో పనిచేస్తున్నారో? అక్కడకు లేటవ్వ లేదా?'' అని అడిగాడు.

రాజారావు తనను సమర్ధించుకుంటూ- ''నేను లేటవ్వడమేమిటండీ. రోజూ టైముకే ఆఫీసుకి వెళ్తాను. నా సిన్సియారిటీ చూసే నాకు పర్సనల్ లోన్స్ సీటిచ్చారు. నేను బేంక్‌లో పనిచేస్తున్నాను. పర్సనల్ లోన్ సాంక్షన్, రికవరీ నా పని. అయితే గత ఇరవై రోజులుగా తహసిల్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ గుమస్తా కోసం తిరుగుతూ, బేంక్‌కి లేటవుతున్నాను'' అన్నాడు.

రాజారావు మాటలకి అతను పెద్దగా నవ్వాడు. ''ఓ అదా సంగతి! రేపు మీరు తహసిల్ ఆఫీసుకి వెళ్ళండి. పదిగంటలకి అతనక్కడ ఉంటారు. అతన్ని కలసి మీ పని పూర్తి చేసుకోండి. ఎల్లుండి బేంక్‌కి టైముకే వెళ్ళండి''

అతని మాటలకి రాజారావు ఆశ్చర్యపోయాడు. ''రేపతను పదికే వస్తాడని మీకెలా తెలుసు?'' అని అడిగాడు.

దానికతను నవ్వుతూ సమాధానం చెప్పాడు.

''సార్! నేనే ఆ తహసిల్ ఆఫీసు రిజిస్ట్రేషన్ గుమస్తాను. నా సాలరీ మీద పర్సనల్ లోను కోసం బేంక్ చుట్టూ మీకోసం తిరుగుతూ, గత ఇరవై రోజులుగా ఆఫీసుకి లేటవుతున్నాను. లేకపోతే, నేనెప్పుడూ టైముకే ఆఫీసులో ఉంటాను. రేపు మీకోసం బేంక్‌కి వెళ్ళడం మాని, ఆఫీసుకి వెళ్ళి మీ పని పూర్తిచేస్తాను. ఎల్లుండి మీరు టైముకి బేంక్‌కి వెళ్ళి, నా పని చూడండి.''

**-బి.హెచ్.వి.నాగేశ్వరరావు**

# చెప్పుదెబ్బ

పొరుగూరులో జరుగుతున్న పెళ్ళికి వెళ్ళారు రాజు, గోపి.

రాజుకు క్లాసులోను, బజార్లలోను, సినిమా హాలు దగ్గర అమ్మాయిలను ఏడిపించడం అలవాటు. స్నేహితులు ఎంత వారించినా వినేవాడు కాదు.

పెళ్ళిలో అమ్మాయిలను ఏడిపించకుండా వుండాలని మాట తీసుకొని బయలుదేరాడు గోపి, రాజుతో.

అయినప్పటికీ రాజు తనదైన శైలిలో అమ్మాయిలవైపు చూస్తున్నాడు. గోపి ఎంత వారించినా వినడం లేదు.

''ఒరేయ్! గోపి, ఆ బ్లూకలర్ చుడీదార్ వేసుకున్న అమ్మాయిని చూడరా, జన్మ తరించిపోతుంది'' హుషారుగా అన్నాడు రాజు.

గోపి మాత్రం టేప్ రికార్డర్‌లో వస్తున్న పాటలు వింటూ కుర్చీమీద కూర్చున్నాడు.

రాజు మాత్రం కామెంట్‌లు విసురుతున్నాడు.



మధ్యాహ్నం భోజనాల దగ్గర రాజు ఇటు అటు తిరుగుతూ ఆ అమ్మాయిని తాకుతూ వున్నాడు. ఆ అమ్మాయి సీరియస్‌గా చూస్తూ తప్పించుకుంటోంది. గోపి గమనిస్తూనే వున్నాడు.

సాయంత్రం షామియానా క్రింద కూర్చున్న వాళ్ళకు కారబ్బూందీ, టీ సప్లయ్ చేస్తున్నారు.

''రాజూ! నువ్వు పెళ్ళికొచ్చావా?'' అంటూ పలకరించింది రాజు పిన్ని కాంతం.

''అవును పిన్ని, ఉదయాన్నే వచ్చాను, మీరెప్పుడొచ్చారు'' అడిగాడు రాజు.

''నేను, చెల్లి ఉదయాన్నే వచ్చాం'' అంది కాంతం.

''చెల్లిని తీసుకొస్తాను ఇక్కడే వుండు. పద్మను నువ్వు చిన్నప్పుడు చూశావు'' అంటూ లోపలికెళ్ళింది కాంతం.

కాంతంతో వస్తున్న అమ్మాయిని చూసి రాజుకు ముచ్చెమటలు పోసాయి.

**-వైదా ఈశ్వరరావు (మిండి)**




